# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 60 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 28 జనవరి 2026 | పేజీలు : 4







## అమ్మల రాకకు వేళాయె..

- సుందరంగా ముస్తాబైన మేడారం గద్దెలు
- నేడు సారాలమ్మ ఆగమనం

2





## మున్సి'పోల్స్'కు మోగిన నగారా..!

ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ

3 లో

- నేటి నుంచి నామినేషన్లు ప్రారంభం
- 30వ తేదీ వరకు నామినేషన్లకు గడువు
- 31 స్క్రూటినీ.. ఫిబ్రవరి 2న ఉపసంహరణ
- 11న ఎన్నికల పోలింగ్
- 13న ఓట్ల కౌంటింగ్



# అమ్మల రాకకు వేళాయే..!

- సుందరంగా ముస్తాబైన మేడారం గద్దెలు
- నేడు సారాలమ్మ ఆగమనం
- పెళ్లికొడకైన బలెల్లిన పగిడిద్దరాజు

*మేడారం జాతరలో ప్రధాన ఘట్టం సమ్మక్క, సారలమ్మ రాక.. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆ అపూర్వ ఘట్టం రానే వచ్చింది. తల్లుల రాక కోసం ప్రధాన గద్దెలు సుందరంగా ముస్తాబయ్యాయి. గత బుధవారం 'మండమెలిగె'తో జాతరకు అంకురార్పణ కాగా.. నేడు, రేపు తల్లుల రాకతో పరిపూర్ణం కానుంది. సమ్మక్క, సారలమ్మ పూజారులైన వడ్డెలను ఒప్పించి అమ్మవార్లను గద్దెకు తీసుకురావడం అధికార యంత్రాంగానికి అనాదిగా వస్తున్న ఆచారం. దేవతల ఆగమనం కోసం పడిగాపులు కాసే లక్షలాది మంది భక్తులకు దర్శన భాగ్యం కల్పించేందుకు అధికారులు పూజారులను బతిమాలి తీసుకొస్తారు. గిరిజన సంప్రదాయక వాయిద్యాలతో సమ్మక్క, సారక్కలను తీసుకొచ్చే ఆ ఘట్టం మహోద్విగ్నం..* - మేడారం, ప్రత్యేక ప్రతినిధి



## ఆదివాసీ సాంప్రదాయాలతో...

మేడారం జాతరలో ప్రతీ ఒక్క సన్నివేశం ఆదివాసీ ప్రత్యేక సంస్కృతీ, సాంప్రదాయాలకు నిలువుటద్దం. మంత్రాలు, హంగులు, ఆర్భాటాలు లేకుండా తమదైన విశిష్ట ఆరాధ్య విధానాలతో జాతరలోని ప్రతీ ఘట్టం ఉంటుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరలో అత్యంత ప్రధాన ఘట్టం చిలకల గుట్ట నుండి సమ్మక్క ఆగమన దృశ్యం. అయితే మేడారంలో తొలి ఘట్టం కన్నెపల్లి నుంచి సారలమ్మ రావడం. మేడారానికి 3 నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్నెపల్లి గ్రామంలోని గుడి నుంచి సారలమ్మను మేడారం గద్దెల తీసుకువస్తారు. ఇందుకు బుధవారం ఉదయం కన్నెపల్లి గుడిలో కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజల అనంతరం తెల్లని వస్త్రంతో తయారు చేసిన హనుమంతుడి బొమ్మతో ఉన్న పతాకంతో వడ్డెలు ఒక్కసారిగా గుడి నుంచి బయటకు రావడం సారలమ్మ రాకకు చిహ్నం. సారలమ్మతో గుడి చుట్టూ ప్రదక్షణం చేసిన అనంతరం వరం పట్టిన (దారిపై పడుకొని ఉన్న) వందలాది భక్తులపై నుంచి సారలమ్మను తీసుకెళ్లే వడ్డెలు నడుచుకుంటూ బయలుదేరుతారు. లక్షలాది భక్తుల తన్మయత్వం నడుమ, ముఖ్యంగా ఛత్తీస్ గఢ్ నుంచి వచ్చే ఆదివాసీలు, గుత్తి కోయల నృత్యాల మధ్య సారలమ్మ గద్దెలను చేరుకుటుంది. కన్నెపల్లి నుంచి బయలు దేరిన సారలమ్మ మధ్యలో ఉన్న జంపన్న వాగులో పారే నీళ్ల నుంచి మేడారం గద్దెలకు చేరుకోవడానికి దాదాపు రెండున్నర గంటలకు పైగానే పడుతుంది. ఇదే సమయానికి గోవింద రాజులు, పడిగెద్ద రాజులు కూడా మేడారంలోని వారి వారి గద్దెలపైకి చేరుకుంటారు. ఇలా, మేడారం జాతర లోని తొలిరోజు కార్యక్రమం అత్యంత వైభవంగా పూర్తిగా కోయ గిరిజన సాంప్రదాయంతోనే జరుగుతుంది. మరుసటి రోజు గురువారం చిలకలగుట్టలో నుంచి సమ్మక్కను తీసుకువస్తారు.






## గట్టమ్మకే తొలి మొక్కు..

మేడారం జాతరకు వెళ్లే భక్తులు, మొదట గట్టమ్మ తల్లిని దర్శించుకోవాల్సిందే. లేకపోతే తిప్పలు తప్పవని భక్తుల నమ్మకం. వరంగల్ నుంచి మేడారం వెళ్లే దారిలో (వరంగల్‌ఏటూరునాగారం రోడ్) ములుగు పట్టణానికి వెళ్లడానికి ముందు రోడ్ పక్కనే గట్టమ్మ గుడి ఉంటుంది. గట్టమ్మకు ముందుగా మొక్కులు చెల్లించకుండా వెళ్తే గట్టమ్మ ఆగ్రహానికి గురికాకతప్పదని భక్తుల విశ్వాసం. మేడారం జాతర పనులు ప్రారంభించడానికి ముందు వరంగల్ జిల్లా అధికారులు కూడా ముందుగా గట్టమ్మకు పూజలు నిర్వహించడం అనవాయితీగా వస్తుంది.




















# మున్సి 'పోల్స్'కు మోగిన నగారా..!

- ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ
- నేటి ఉంచి నామినేషన్‌లు ప్రారంభం
- 30వ తేదీ వరకు నామినేషన్లకు గడువు
- 31 స్క్రూటినీ.. ఫిబ్రవరి 2న ఉపసంహారణ
- 11న ఎన్నికల పోలింగ్.. 13న ఓట్ల కౌంటింగ్

**మన చౌరాస్తా, హైదరాబాద్ ప్రతినిధి :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్రంలోని ఏడు నగరపాలక సంస్థలు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగనున్నాయి. మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశమై ఎన్నికల నిర్వహణ పై చర్చించారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. షెడ్యూల్ విడుదలతో తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 31న స్క్రూటినీ నిర్వహించి పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా వెల్లడించనున్నారు. ఫిబ్రవరి 1న తిరస్కరణకు గురైన నామినేషన్లపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 3వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు తుదిగడువు. అదేరోజు అభ్యర్థులు తుది జాబితా ప్రకటించనున్నారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 13న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడించనున్నారు.

# జాతరకు విద్యుత్ శాఖ ఏర్పాట్లు పూర్తి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
- నాలుగు వేర్వేరు మార్గాల నుండి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఏర్పాట్లు
- క్షేత్రస్థాయిలో విద్యుత్ పనుల పర్యవేక్షణ , ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద లోడ్ పరిశీలన
- రేడియో ఫ్రీక్వెన్సీ టెక్నాలజీతో 106 ట్రాన్స్‌ఫార్మర్ల పర్యవేక్షణ.



**ములుగు, మన చౌరాస్తా :** మేడారం జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని ఎన్పీడీసీఎల్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి , ఐఏఎస్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విద్యుత్ అధికారులతో మేడారంలో పర్యటించి విద్యుత్ సరఫరా తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 132 కెవి కమలాపూర్ , పస్రా , ములుగు నుండి వచ్చే 33 కెవి నాలుగు వేర్వేరు మార్గాల నుండి ప్రత్యామ్నాయ సరఫరా కోసం డి.పి. స్ట్రక్చర్‌తో కూడిన 8 పోల్ వ్యవస్థను పర్యవేక్షించారు . 106 ట్రాన్స్‌ఫార్మర్లను నేరుగా సబ్ స్టేషన్ నుండి మానిటర్ చేసేందుకు రేడియో ఫ్రీక్వెన్సీ వ్యవస్థను ఏర్పాటు చేశామని, దీని ద్వారా సమస్యను తక్షణమే గుర్తించి సరిచేయవచ్చని తెలిపారు. జాతర విధుల్లో ఉండే సిబ్బంది కోసం 55 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరికి ఏడీఈ, ఏఈ స్థాయి అధికారులు పర్యవేక్షకులుగా ఉంటారు. సమ్మక్క సబ్ స్టేషన్ వద్ద సిబ్బందికి ఎన్పీడీసీఎల్ లోగోతో కూడిన టిషర్టులను సీఎండీ పంపిణీ చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా ను ఎప్పటికప్పుడు మానిటర్ చేయడానికి 600 మంది సిబ్బందిని జాతర కొరకు నియమించడం జరిగిందని చెప్పారు . వీరందరికి అన్ని వసతులు ఏర్పాటు చేశామని 70 టెంట్లను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు . తాడ్వాయి, పస్రా సబ్ స్టేషన్లను సందర్శించిన సీఎండీ కొత్తగా నిర్మిస్తున్న సెక్షన్ ఆఫీస్ మరియు గట్టమ్మ వద్ద సబ్ స్టేషన్ పనులను వేగవంతం చేయాలని ఏజెన్సీలను ఆదేశించారు. జాతరను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో , డైరెక్టర్లు వి . మోహన్ రావు టి .మధుసూదన్ , చీఫ్ ఇంజనీర్ కె . రాజు చౌహన్ , సీఈ ఐటి శ్రవణ్ కుమార్ , జియం ఐటి శ్రీనివాస్ , ములుగు ఎస్ఈ ఆనందం , భూపాలపల్లి ఎస్ఈ మల్చూరు , డిఈ ములుగు పి . నాగేశ్వర రావు , డి .ఈ MRT & కంస్ట్రక్షన్ సదానందం, డ్.ఈ టెక్నికల్ భాస్కర్ , ఈ ఈ సివిల్ వెంకట్ రామ్ , ఏడీఈ లు : రాజేష్ , వేణుగోపాల్ , సందీప్ పాటిల్ పాల్గొన్నారు .



# ఆయిల్ ఫామ్ తోటలు సందర్శించిన అధికారి

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండలంలోని మర్రిముస్త్యాలలో రైతులు వంగ రఘుపతిరెడ్డి, మధుసూధనరెడ్డి, మల్లారెడ్డి, చంద్రారెడ్డి సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జి.సువర్ణ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్ పామ్ 30 సంవత్సరాల పంట అని, వరి తో పోలిస్తే ఈ పంటలో లాభం ఎక్కువ ఉంటుందని, రైతులు రఘుపతి రెడ్డి ని ఆదర్శంగా తీసుకొని పంట సాగుకు ముందుకు రావాలని కోరారు. అలాగే ఆయిల్ పామ్ కి ఉద్యాన శాఖా ద్వారా మొక్కలకి, డ్రిప్ పరికరాలకు ఇచ్చే సబ్సిడీ వివరాలు చెప్పారు. అలాగే 4 సంవత్సరాల యాజమాన్యానికి రాయితీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆయిల్ ఫెడ్ అధికారి భాస్కర్ రెడ్డి, మండల ఉద్యాన అధికారిని కౌసల్య, వ్యవసాయ విస్తరణ అధికారి భాస్కర్ రెడ్డి ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఇంచార్జీ కార్తీక్, సర్పంచ్ రవి, రైతులు పాల్గొన్నారు.




లింగంపల్లిలో...



ఇప్పగూడెంలో...

# అనుబంధాలెన్నో..


అమ్మాపురంలో ముస్తాబైన సమ్మక్క, సారాలమ్మ గద్దెలు


అమ్మాపురంలో ముస్తాబవుతున్న తోరణం


అమ్మాపురంలో...

- **ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా జోరుగా మినీ మేడారాలు**
- **ముస్తాబైన తల్లుల గద్దెలు**
- **రెండేళ్లకోమారు జోరుగా జాతరలు**
- **ఇక్కడంతా ఆదివాసేతరులదే హవా!**

**( మేడారం, ప్రత్యేక ప్రతినిధి )**

మేడారం సమ్మక్క- సారలమ్మల జాతర.. అప్పట్లో దట్టమైన అటవి ప్రాంతం.. కాలినడక, ఎడ్లబండ్లు.. రోజుల కొద్దీ భయం భయంగా ప్రయాణం.. అయినా అమ్మలున్నారనే భరోసా.. దర్శించుకుని తీరాల్సిందే.. మొక్కులు చెల్లించాల్సిందే.. ఈ నేపథ్యంలో ప్రయాణ భారాన్ని తగ్గించుకునేందుకు కొన్ని ప్రాంతాల్లో అమ్మవార్లను ప్రతిష్టించి, అనుబంధంగా జాతరలు నిర్వహిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో వనదేవతల కోరిక మేరకు జాతరలు జరుగుతున్నాయి. ఈ అనుబంధ జాతరలు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. ఇందులో ఒక్క మేడారం తప్ప మిగతావన్నీ ఆదివాసీయేతర ప్రాంతాలే కావడం గమనార్హం. నాటి ఉమ్మడి జిల్లాలైన వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అనుబంధ జాతరలు వెలిశాయి. ముఖ్యంగా వరంగల్, కరీంనగర్ జిల్లాలోనే ఇవి ఎక్కువగా ఉన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం మండల కేంద్రంలో, చొప్పదండి మండలం గుమ్లాపూర్, రాగంపేట, రామగుండం మండలంలోని గోలివాడ గ్రామంలోనూ, హుజురాబాద్‌లోని రంగనాయకుల గుట్ట వద్ద వీణవంక మండలంలోని పోతిరెడ్డిపేట, కమలాపురం మండల కేంద్రంలోనూ, కన్నూరు గ్రామంలోనూ, ఎలకతుర్తి మండల కేంద్రంలోనూ జాతరలు జరుగుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జాతరల్లో బయ్యక్కపేట, ఆగ్రంపహాడ్, అమ్మవారిపేట, లింగంపల్లి, గుర్రంపేట జాతరలను ప్రధానంగా పేర్కొనవచ్చు. అయితే ఆగ్రంపహాడ్, బయ్యక్కపేట జాతరల పూజరులు మాత్రం ఎవరికి వారే ప్రధాన సమ్మక్క మాదంటే మాదేననే వాదనలు కూడా ఉన్నాయి. ఆగ్రంపహాడ్ వారు, బయ్యపేటవాళ్లు తమతమ గ్రామాల్లోనే మొదటగా సమ్మక్క వెలసిందని చెబుతుంటారు. అలాగే వరంగల్ జిల్లాలో మద్ది మేడారం, బొంతగట్టు నాగారం, కూటిగల్, గబ్బిలాలమడుగు, ఫ్రూట్ ఫారం, ఐలాపూర్ తిరుమలగిరి, కంఠాత్మకూర్, పులిగిల్ల, కౌకొండ, కమలపూర్, మొగుళ్లపల్లి, వెంచరామి, జోగంపల్లి, ఇప్పగూడెం, తాటికొండ, ఫతేపూర్, శ్రీపతిపల్లి, చిల్పూర్ గుట్ట, నర్మెట మండలం అమ్మాపురం గ్రామల్లోనూ మినీ జాతరలు జరుగుతాయి. ఆదివాసీ గిరిజనుల జాతరగా పేర్కొనే సమ్మక్క- సారలమ్మ జాతర మేడారం ప్రధాన జాతరే అయినా భక్తుల సౌలభ్యం కోసం ఆయా ప్రాంతాల్లో అనుబంధ జాతరలు కొంతమంది శివసత్తులు కలలో అమ్మవారు ప్రత్యక్షమై ఆయా ప్రాంతాల్లో నెలవై ఉంటానని కోరుకున్నందున కొన్ని జాతరలు ఏర్పడ్డాయి. మరికొన్ని జాతరలు మేడారం చాలా దూరంగా ఉన్నందున పోయిరావడం కష్టం అని తలచిన భక్తులు తమ ప్రాంతాల్లోనే అమ్మవారికి ప్రతిరూపంగా గద్దెలు ఏర్పరచుకుని జాతరను నిర్వహిస్తున్నారు. అదే విధంగా సింగరేణి యాజమాన్యం కార్మికుల శ్రేయస్సు, సంస్థ స్వలాభం కోసం సమ్మక్క-సారలమ్మలను ప్రతిష్ఠించి జాతర నిర్వహిస్తోంది. ఏది ఏమైన ఎన్ని అనుబంధ జాతరలు ఏర్పడ్డా సమ్మక్క సమ్మక్కయే.. సారలమ్మ సారలమ్మనే..!

## అంతా ఆదివాసీ యేతరులే...!

సమ్మక్క- సారలమ్మ జాతర పేర రాష్ట్రంలో ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లోని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో జాతరలు ఏళ్లుగా ఘనంగా నిర్వహించుకుంటున్నారు. ఆయా జాతరల్లో ఎక్కడ కూడా ఆదివాసీ గిరిజనులు కనిపించరు. కోయజాతి కొంగు బంగారంగా పూజలందుకునే తల్లీబిడ్డల ప్రతిరూపాలుగా ఆదివాసీ సంప్రదాయాల ప్రకారమే సాగినా స్థల ప్రాముఖ్యం, ఇతరేతర పురాగాధలు ప్రాచుర్యంలో ఉన్నా అవన్నీ ఆదివాసీ యేతరులదే హవా కొనసాగుతుండటం గమనార్హం.



శ్రీపతిపల్లిలో...


చిల్పూరు గుట్టలో...

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**